క్లుప్తంగా

ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: మండలంలోని శింగసానిపల్లెలో లక్ష్మీ తిరుమలనాథస్వామి పారువేట మహోత్సవంలో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మంగళవారం పాల్గొన్నారు. అశ్వవాహనంపై స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు వద్ద మంగళవారం మహిళను లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వివరాలు.. వేంపాడు గ్రామానికి చెందిన గండి పుల్లమ్మ రోడ్డు దాటుతుండగా అద్దంకి నుంచి దర్శి వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ వాహనంలో నరసరావుపేటకు తరలించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు: శనగ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. మల్కాపురం, రజానగరం గ్రామాల్లో సాగు చేసిన శనగ పైరును ఆయన మంగళవారం పరిశీలించారు. శనగ పంటలో వచ్చే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు రైతులకు వివరించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో తక్కువ పెట్టుబడులు, అధిక దిగుబడులు పొందాలని కోరారు. సర్పంచి వలి, ఎంపీటీసీ వెంకట రామిరెడ్డి, ఏఈఓ నాగరాజు, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

జూదరులకు జైలు

యర్రగొండపాలెం: కోడి పందేలు ఆడుతున్న జూదరులకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం మార్కాపురం జడ్జి తీర్పు చెప్పారు. ఈ నెల 15న మండలంలోని కొలుకుల పంచాయతీ చెన్నరాయునిపల్లెలో కోడి పందేలు ఆడుతున్న 8 మందిని ఎస్సై జి.కోటయ్య అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 5 రోజుల జైలు, ఒక్కొక్కరికి రూ 50 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని ఎస్సై తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి



వ్యాపారులకు సూచనలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కంభం: పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని సీఐ రాజేష్, ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు సూచించారు. కందులాపురం కూడలిలో డ్రైనేజీని సైతం ఆక్రమించుకొని ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించే కార్యక్రమం మంగళవారం సాయంత్రం చేపట్టారు. దుకాణదారులు డ్రైనేజీ అవతలికే వస్తువులు ఉంచుకోవాలని, రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి దుకాణాల వద్ద వారు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించారు.

యువతకు ఆదర్శం.. వివేకానందుడు



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న అధికారులు

మార్కాపురం: యువతకు ఆదర్శం వివేకానందుడని తెలంగాణ హైకోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఆజాదిక అమృత మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ యువతే దేశానికి ఆదర్శమన్నారు. తిరుపతి, అనంతపురం పట్టణాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణ స్వామి, కరిముల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ బృందం మాట్లాడుతూ యువత బాధ్యత కలిగి ఉండాలని, అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న చెన్నకేశవులను అభినందించారు. అనంతరం ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

ప్రతిపక్షానికి మతి చలించింది



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మూడు దశాబ్దాల పాటు వైఎస్ జగనే ముఖ్యమంత్రి
- రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం

త్రిపురాంతకం: రాష్ట్రంలో సంక్షేమ పాలనను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అభివృద్ధిని చూసి ఓర్వలేక విష ప్రచారాలకు పూనుకున్నారని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మూడు దశాబ్దాలపాటు ముఖ్యమంత్రిగా మనం చూస్తామని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహం అవసరం లేదని మంత్రి పేర్కొన్నారు. త్రిపురాంతకంలో మంగళవారం నిర్వహించిన సచివాలయం కన్వీనర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్నది వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. ప్రతిపక్షాలు పొంతనలేని మాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నాయని విమర్శించారు. విమర్శించేందుకు ఏమీలేక శాంతి భద్రతలు క్షీణించాయి, అరాచక పాలన అంటు విమర్శలకు దిగుతున్నారని, అరాచకం ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు ఒక్క నియోజకవర్గంలో కూడా సరైన నాయకత్వం లేదని, ఎవరు అభ్యర్థిలో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నైరాశ్యంలో ఉన్న ప్రతిపక్షాలు అక్కడక్కడా ఉన్న తమ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో ఏ పథకం బాగోలేదో చెప్పి విమర్శించాలని సూచించారు. ఈ ఏడాది చాలా ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు వెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధిపై కన్వీనర్లు అవగాహన కలిగి ఉండి, ప్రజలకు వివరించాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరిగే సమావేశాల్లో కన్వీనర్లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కన్వీనర్లు, వలంటీర్లు సమష్టిగా పని చేయాలన్నారు. కన్వీనర్లకు ఉచిత బీమా అందించనున్నట్లు తెలిపారు. ప్రజలకు సకాలంలో అందిస్తున్న వలంటీర్లను అభినందించారు. కరోనా వేళ కంటైన్మెంట్ జోన్లలో సైతం సేవలందించిన వలంటీర్ వ్యవస్థను ప్రతిపక్ష తెలుగుదేశం అభినందించకపోగా విమర్శలకు దిగడం దారుణమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూసి సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీల ద్వారా ఇచ్చారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటిసి మాకం జాన్‌పాల్, గ్రామసర్పంచ్ పొన్నా వెంకట లక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సిపి కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, దేవాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గ్రామ కన్వీనర్లు, వలంటీర్లు

మీకు సేవ చేసేందుకే వస్తున్నా



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం టౌన్: మీకు సేవ చేసేందుకే మీ ముందుకు వస్తున్నా అని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా అందరికీ సంక్షేమ కార్యక్రమాలు సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు వల్ల ప్రజల కష్టాలు తీరుతున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారు రాజకీయంగా, ఆర్థికంగా, అభివృద్ధి చెందేలా పరిపాలన చేస్తున్నారన్నారు. వార్డులో సమస్యలను పరిష్కరించేందుకే తామంతా ఉన్నామన్నారు. రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, వైఎస్ఆర్ పింఛన్, జగనన్న విద్యాదీవెన వంటి పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. వార్డులోని ప్రజలు ఎమ్మెల్యే కేపీపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసులు, సిరాజ్, బుశ్శెట్టి నాగేశ్వరరావు, మహిళ సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దొడ్డా భాగ్యలక్ష్మీ, డి.ప్రసాద్, నాగ అరుణ, షెక్షావలి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, హర్షితబాబి, రోజిలిడియా, కె.శివారెడ్డి, కె.రంగయ్య, మయూరి కాశిం, ఉత్తమ్‌కుమార్, మైనారిటి సెల్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, నాగ సుధీర్, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, ఏఈ ఆదినారాయణ, రసూల్, కె.చెన్నకేశవులు, సచివాలయం, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురవారెడ్డి సేవలు అభినందనీయం



గురవారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: దివంగత దారం గురవారెడ్డి సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. చలింవేంద్రలో దారం గురవారెడ్డి విగ్రహాన్ని వారు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాచల క్షేత్రం ధర్మకర్తగా గురవారెడ్డి చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. గోశాల, కాశీనాయన ఆశ్రమం, శ్రీలక్ష్మీపద్మావతి దేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం, కొండపైకి రోడ్డు వేయించడంలో పట్టు బట్టి దేవాలయం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సఫలీకృతులయ్యారన్నారు. అనారోగ్య కారణంగా గురవారెడ్డి మృతి చెందడం తమకెంతో బాధాకర విషయమన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ పాణెం కృష్ణారెడ్డి, రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్టీఓ చంద్రశేఖర్‌రావు

పొదిలి రూరల్: పొదిలి తాలూకా పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన పెన్షన్‌దారులు ఫిబ్రవరి నెలాఖరి నాటికి తమకు చెందిన లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని సబ్ ట్రెజరీ ఆఫీసర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం పొదిలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారుల సమస్యలు తాము పరిష్కరిస్తున్నామని చెప్పారు. వేలు ముద్రలు పడని పెన్షనర్లకు ఐరిష్ ద్వారా సర్టిఫికెట్లు సమర్పించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి, నడిచేందుకు వీలుకాని వారికి పెన్షన్‌దారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. పొదిలి తాలూకా పెన్షన్‌దారుల సంఘ అధ్యక్షుడు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదర్‌వలి, అసోసియేట్ అధ్యక్షుడు అనికాళ్ల వీరారెడ్డి, డీఎల్ నరసింహారావు, చిట్టెంశెట్టి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శ్రీహరి, గోవిందయ్య, తజానీ, దశరథులు పాల్గొన్నారు.

గృహసారథుల ఎంపికపై ఎమ్మెల్యే కేపీ సమీక్ష



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గృహసారథులను ఎంపిక చేయాలని చైర్మన్, వైస్ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో మార్కాపురం, మండల, పట్టణ, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో గృహ సారథుల ఎంపికపై ఎమ్మెల్యే సమీక్షించారు. వలంటీర్‌ల సేవలకు అదనంగా గృహ సారథులను ఎంపిక చేయాలన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్‌ల తొలగింపుపై తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని, ఈ విషయంలో ఎలాంటి సందేహాలు వద్దన్నారు. మంచి వ్యక్తులను గృహ సారథులుగా ఎంపిక చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ వలంటీర్‌లు సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలన్నారు. క్లస్టర్ పరిధిగా కౌన్సిలర్‌లు రథసారథులను నియమించాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీలు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఎడుకొండలు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ ఎం.మల్లికార్జునరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, ఎంపీటీసీ మల్లారెడ్డి, ధర్మకర్త బీకేవీకే అర్జున రావు, కౌన్సిలర్‌లు సిరాజ్, కొత్త కృష్ణ, షెక్షావలి, దొడ్డా భాగ్యలక్ష్మి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, ఉస్మాన్, కె.శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, గుంటక వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, సంజీవరెడ్డి, పొదిలి మాజీ ఎంపీపీ నరసింహారావు, కాల్వ దుర్గ, తర్లుపాడు కన్వీనర్ మురారి, సర్పంచ్ మస్తాన్, జంకె వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయ పండగలతో ఆనందం



మద్దిశెట్టి రవీంద్రను సన్మానిస్తున్న నాయకులు

తాళ్లూరు: పండగలు సంప్రదాయంగా జరుపుకుంటే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని, అందరూ ఆనందంగా ఉంటారని వైఎస్సార్ సీపీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు పోటీల్లో విజేతలకు మండలంలోని కొత్తపాలెంలో సోమవారం రాత్రి బహుమతులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న రైతులు, యువకులు, మహిళలను అభినందించారు. అనంతరం మద్దిశెట్టి రవీంద్రను నిర్వాహకులు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ.వెంకటేశ్వర రెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డిలు, సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచి కాశిరెడ్డి, గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి, మేకల నాగేశ్వరావులు ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాలువ పనులకు మోక్షం



జేసీబీతో పనులు చేయిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: పొదిలి పట్టణంలోని చిన బస్టాండ్ సెంటర్‌లో ఆక్రమిత కాలువ పనులు పంచాయతీ అధికారులు మంగళవారం నుంచి ప్రారంభించారు. కొందరు ఎన్నో ఏళ్లుగా కాలువలను ఆక్రమించి పూడ్చి దానిపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. వర్షం పడినప్పుడు నీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మంగళవారం కాలువపై ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆక్రమణదారులు కొద్దిసేపు పనులు అడ్డుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు. ఎట్టకేలకు అధికారులు కాలువపై ఉన్న మట్టిని తొలగించి చదును చేశారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు దుకాణదారులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు స్థానిక బస్టాండ్ సెంటరులోని దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం, ఎంఆర్ఓ, ఎంపీడీఓ కార్యాలయాల నుంచి రైల్వే స్టేషన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే పర్యావరణ కాలుష్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి వివరించారు. ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ వలంటీర్ల సమావేశం

త్రిపురాంతకం: స్థానిక బాలాత్రిపురసుందరీదేవి ఆలయం సమీపంలోని బ్రాహ్మణ సత్రం వద్ద బుధవారం సచివాలయ వలంటీర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మరియదాస్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షిస్తారని తెలిపారు.

బీసీల రిజర్వేషన్ ఘనత శరద్ యాదవ్‌దే



శరద్‌యాదవ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: జాతీయ స్థాయి బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయించిన ఘనత శరద్ యాదవ్‌దేనని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి, అఖిల భారత యాదవ మహాసభ క్రమశిక్షణ సంఘం చైర్మన్ పీఎల్‌పీ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీసీ భవన్‌లో శరద్ యాదవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేసేలా అప్పటి ప్రధాని వీపీ సింగ్‌ను ఒప్పించిన శరద్ యాదవ్ చిరస్మరణీయుడన్నారు. యాదవ సంఘ నాయకులు ముంగమూరి పోలయ్య, పిన్నిక చక్రపాణి, గంగరాజు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత త్రిపురాంతకం జట్టు



ప్రథమ బహుమతి అందుకుంటున్న త్రిపురాంతకం జట్టు

త్రిపురాంతకం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని నడిగడ్డలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. హోరాహోరీగా సాగిన ఈ టోర్నీలో త్రిపురాంతకం జట్టు విజయం సాధించింది. నడిగడ్డ జట్టు, నడిగడ్డ స్వాములు జట్టు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను నిర్వాహకులు అందజేశారు.